క్లుప్తంగా

సారా తయారీని అరికట్టాలి



ఎస్‌ఈబీ అధికారులతో సమీక్షిస్తున్న చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు

నరసాపురం: నియోజకవర్గంలో ఎక్కడా కూడా సారా తయారీ లేకుండా చూడాలని ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(ఎస్‌ఈబీ) అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన తన కార్యాలయంలో ఎస్‌ఈబీ అధికారులతో సమీక్ష నిర్వహించారు. సారా తయారీ దాదాపుగా తగ్గిపోయిందని ముదునూరి చెప్పారు. అయితే ఇంకా ఎక్కడైనా మూలాలు ఉంటే దృష్టి పెట్టి అరికట్టాలన్నారు. అలాగే బెల్ట్ షాపుల నిర్వహణ కూడా లేకుండా చేయాలని సూచించారు. ఇందుకోసం ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేయాలన్నారు. బెల్ట్ షాపులు, సారా విక్రయాలు వంటి అసాంఘిక కార్యకలాపాలకు ప్రభుత్వం పూర్తి వ్యతిరేకమన్నారు. అలాగే గంజాయి వంటి మాదకద్రవ్యాల అంశంపై కూడా దృష్టి పెట్టాలని సూచించారు.

ద్వారకాతిరుమలకు భక్తుల పాదయాత్ర



ద్వారకాతిరుమలకు పాదయాత్రగా వెళ్తున్న భక్తులు

పెనుమంట్ర: పాలకొల్లు పంచముఖ ఆంజనేయస్వామి ఆలయం నుంచి ఎస్వీవీకే రమణ స్వామి ఆధ్వర్యాన దీక్షలు చేపట్టి అనంతరం ద్వారకాతిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి దర్శనానికి వందలాదిగా భక్తులు తరలివెళ్లారు. శుక్రవారం 800 మందికి పైగా భక్తులు శనివారం స్వామిని దర్శించుకునేందుకు రమణ స్వామి వెంట మార్టేరు తాడేపల్లిగూడెం రోడ్డులో పాదయాత్రగా బయల్దేరారు.

పోలీసులు దృఢంగా ఉండాలి

సాక్షి, భీమవరం: పోలీస్ సిబ్బంది శారీరక, మానసికంగా దృఢంగా ఉంటేనే ప్రజలకు మెరుగైన సేవలు అందించగలుగుతారని జిల్లా అదనపు ఎస్పీ ఏవీ సుబ్బరాజు అన్నారు. భీమవరం మార్కెట్ యార్డు ఆవరణలో శుక్రవారం సివిల్, ఏఆర్, హోంగార్డ్స్ పోలీసు సిబ్బందికి పరేడ్ నిర్వహించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. పోలీసు సిబ్బంది ఆరోగ్య విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆరోగ్యపరమైన సమస్యలు ఎదురైతే జిల్లా పోలీస్ ఆరోగ్య కేంద్రం సేవలను వినియోగించుకోవాలన్నారు. నిత్యం వ్యాయామం, యోగా చేయడం ద్వారా ఆరోగ్యంతో పాటు దృఢంగా ఉండగలుగుతారని ఏఎస్పీ సూచించారు. కార్యక్రమంలో భీమవరం డీఎస్పీ బండారు శ్రీనాథ్, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్‌కు అభినందనలు



ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్

సాక్షి, భీమవరం: రాష్ట్ర ప్రభుత్వ విప్‌గా నియమితులైన భీమవరం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్‌ను స్థానిక క్యాంపు కార్యాలయంలో శుక్రవారం జిల్లా ఎస్పీ యు.రవిప్రకాష్, ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్, డీసీఎంఎస్ చైర్మన్ వేండ్ర వెంకటస్వామి కలిసి అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని పదవులు అందుకోవాలని వారు ఆకాంక్షించారు. వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు బడుగు అశోక్‌బాబు, రాష్ట్ర సెక్రటరీ కామన నాగేశ్వరరావు, భీమవరం నియోజకవర్గ ప్రెసిడెంట్ పేపేటి పెద్దిరాజు, జనరల్ సెక్రటరీ బేతపూడి లోకేష్, రామాని కాస్త్రో, ఏజీపీ యు.వరప్రసాద్ తదితరులు ఉన్నారు.

యువతి అదృశ్యంపై కేసు

పాలకోడేరు: తన మరదలు కనిపించడం లేదని బావ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పాలకోడేరు పోలీసులు తెలిపారు. శృంగవృక్షం గ్రామంలోని ఆర్‌సీఎం చర్చి ఏరియాకు చెందిన లక్ష్మీ సరస్వతి(23) ఇంటర్ చదివి ఇంటి వద్దే ఉంటోంది. ఈమె తల్లి ఉపాధి నిమిత్తం గల్ఫ్ వెళ్లింది. ఇదిలావుండగా అదే గ్రామంలో ఉంటున్న తన అక్క ఇంటికి లక్ష్మీ సరస్వతి ఈనెల 4వ తేదీన అన్నప్రాసన ఫంక్షన్‌కు వెళ్లింది. అదే రోజు మధ్యాహ్నం వాష్ రూమ్‌కి వెళతానని చెప్పి తిరిగి రాలేదని ఆమె బావ మంద ప్రవీణ్‌కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అదే వీధిలో ఉంటున్న మురాల కిరణ్ అనే వ్యక్తిపై అనుమానం ఉన్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పాలకోడేరు ఎస్సై నాళం శ్రీనివాసరావు తెలిపారు.

ఇద్దరిపై కేసు నమోదు

సాక్షి, భీమవరం: పట్టణంలోని గునుపూడి గరువుపేటకు చెందిన మద్దా ఆశాకిరణ్‌ను కొట్టి గాయపర్చిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ ఏఎస్సై కె.శ్రీనివాసరావు తెలిపారు. కె.సూర్యప్రకాష్, జి.ప్రేమ్‌కుమార్‌లు గొడవ పడుతుండగా ఆశాకిరణ్ మోటార్ సైకిల్‌పై వెళ్తూ ప్రశ్నించినందుకు ప్రేమ్‌కుమార్ తన తండ్రితో కలిసి అతనిని కొట్టి గాయపర్చారు.

పేదవాని ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

- జగనన్న ఆరోగ్య సురక్ష పథకంతో రాష్ట్రంలో కొత్త చరిత్ర సృష్టి
- ప్రభుత్వ చీఫ్ విప్ ప్రసాదరాజు



నరసాపురం రూరల్: లక్ష్మణేశ్వరం సచివాలయం వద్ద జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో మాట్లాడుతున్న చీఫ్ విప్ ప్రసాదరాజు

నరసాపురం: జగనన్న ఆరోగ్య సురక్ష పథకం అమలు రాష్ట్రంలో కొత్త చరిత్ర అని ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. నరసాపురం పట్టణం 10,11,12,13,28,29,30,31 వార్డులకు సంబంధించి రైల్వేస్టేషన్ రోడ్డులోని కస్తూరిబా స్కూల్ వద్ద శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. అనుభవజ్ఞులైన వైద్యుల పర్యవేక్షణలో ప్రజలకు పరీక్షలు చేసి, ఉచితంగా ముందులు అందజేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన ప్రసాదరాజు శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. రోగమొస్తే పేదలు వైద్యం కోసం అప్పుల పాలు కాకూడదనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ పథకాన్ని తీసుకొచ్చారని వివరించారు. అదే ఉద్దేశ్యంతో మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ఆరోగ్యశ్రీ పథకాన్ని అమల్లోకి తెచ్చారన్నారు. ఆయన తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత ఆరోగ్యశ్రీ పథకాన్ని మరింత బలోపేతం చేశారన్నారు. ప్రస్తుతం ఆరోగ్యశ్రీలో 3200 వ్యాధులకు ఉచితంగా వైద్యం చేసేలా పథకాన్ని మరింత పటిష్టం చేశారన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, వలంటీర్లు, గృహసారథులు, ఆరోగ్య శాఖ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి బీపీ, షుగర్ తదతర 7 రకాల పరీక్షలు నిర్వహిస్తున్నారని చెప్పారు. వార్డులు, గ్రామాల ప్రజలకు సమీప ప్రాంతాల్లో క్యాంప్‌లు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ, వైస్ చైర్మన్ కామన నాగిని, మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు, మత్స్యకార సొసైటీల సంఘం జిల్లా అధ్యక్షుడు అండ్రాజు చల్లారావు, ఏఎంసీ చైర్మన్ గుబ్బల రాధాకృష్ణ, నరసాపురం సొసైటీ అధ్యక్షుడు షేక్ బులిమస్తాన్, ఆయా వార్డుల కౌన్సిలర్లు పాల్గొన్నారు.

పేదలకు మెరుగైన వైద్యసేవలు

పెనుమంట్ర: జగనన్న ప్రవేశపెట్టిన ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల ద్వారా పేదలకు మెరుగైన వైద్యసేవలు అందుతున్నాయని మాజీ మంత్రి, ఆచంట ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. శుక్రవారం పెనుమంట్ర-2 సచివాలయం పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని గ్రామ సర్పంచ్ తాడిపర్తి ప్రియాంక, ఎంపీటీసీ సభ్యుడు గండి రామారావు ప్రారంభించారు. శిబిరాన్ని సందర్శించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలు ఏ రోగాలతో బాధపడుతున్నారో తెలుసుకుని వారికి కార్పొరేట్ స్థాయి వైద్యం ఉచితంగా వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ ద్వారా అందించాలన్నదే జగనన్న ఆలోచన అని, అందుకే అనేక రకాల రోగాలను ఆరోగ్యశ్రీలో చేర్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన శిబిరంలో అంగన్‌వాడీ సిబ్బంది ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్‌ను సందర్శించి వంటకాలను రుచి చూశారు. కార్యక్రమంలో ఎంపీపీ కర్రి వెంకట నారాయణరెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు కర్రి గౌరీ సుభాషిణి, ఏఎంసీ చైర్మన్ వెలగల వెంకటరమణ, పెనుమంట్ర -1 ఎంపీటీసీ సభ్యురాలు చింతపల్లి మంగాదేవి, ఉప సర్పంచ్ భూపతిరాజు శ్రీనివాసరాజు, వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు టి.సుధీర్‌రెడ్డి, సత్తి రాము పాల్గొన్నారు.

కొడమంచిలిలో..

ఆచంట మండలం కొడమంచిలిలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని రుడా చైర్మన్ మేడపాటి షర్మిలా రెడ్డి ప్రారంభించారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, నియోజకవర్గంలో మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు పేదలకు అండగా నిలుస్తున్నారని ఆమె అన్నారు. ప్రజలందరూ సీఎం జగన్‌కు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ చిల్లే లావణ్య, మాజీ చైర్మన్ సుంకర ఇందిర, మండల సర్పంచ్‌ల ఛాంబర్ అధ్యక్షుడు సుంకర సీతారామ్, ఎంపీటీసీ యల్లమెల్లి బేబీ రాజేష్, ఆచంట వేమవరం సర్పంచ్ జక్కంశెట్టి చంటి, పార్టీ నాయకులు గణేషుల సుబ్బారావు, బొంతు శ్రీను, పుచ్చకాయల నాగార్జున, మన్నే సుబ్బారావు, బొక్కా మల్లేశ్వరరావు, కొండేటి లక్ష్మి పాల్గొన్నారు.

ప్రతి గడప చెంతకూ వైద్యం

పెనుగొండ: రాష్ట్రంలో పేదల గడప చెంతకే వైద్యాన్ని అందించిన గొప్ప దార్శనిక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని రుడా చైర్‌పర్సన్, వైఎస్సార్ సీపీ ఆచంట నియోజకవర్గ పరిశీలకురాలు మేడపాటి షర్మిలారెడ్డి అన్నా రు. శుక్రవారం పెనుగొండ మండలం సిద్ధాంతంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఆమె ప్రారంభించి వృద్ధులకు కళ్లజోళ్లు పంపిణీ చేసి, పౌష్టికాహార స్టాల్స్ పరిశీలించారు. గత ప్రభు త్వాలు పేదలకు వైద్యాన్ని నిర్లక్ష్యం చేశాయని విమర్శించారు. సీఎం జగన్ పాలన చేపట్టగానే విద్య, వైద్యానికి పెద్ద పీట వేసి వారికి అండగా నిలుస్తున్నారన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ చింతపల్లి గనిరాజు(చంటి), ఎంపీటీసీ సభ్యులు చిన్నం ఏడుకొండలు, గుత్తుల సత్యవతి రాముడు, వైఎస్సార్ సీపీ పట్టణాధ్యక్షుడు జుత్తిగ దామోదర్, ఎస్సీసెల్ మండల కన్వీనర్ పలివెల శ్రీను పాల్గొన్నారు.

నేడు దగ్గులూరులో జగనన్న ఆరోగ్య సురక్ష

పాలకొల్లు అర్బన్: మండలంలోని దగ్గులూరు గ్రామ సచివాలయ ఆవరణలో శనివారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో సంగాని వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. శిబిరాన్ని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) సందర్శిస్తారని పేర్కొన్నారు. ఆరోగ్య సిబ్బంది సర్వే చేసి గుర్తించిన వారంతా వైద్య శిబిరానికి వచ్చి పరీక్షలు చేయించుకోవాలని ఆయన కోరారు.

ప్రజారోగ్యానికి ప్రభుత్వ భద్రత

యలమంచిలి: రాష్ట్రంలో ప్రజలందరి ఆరోగ్యానికి జగనన్న ప్రభుత్వం పూర్తిస్థాయి భద్రత కల్పిస్తోందని వైఎస్సార్ సీపీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) అన్నారు. పెనుమర్రు గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల ప్రాంగణంలో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో గోపి మాట్లాడుతూ గ్రామాల్లో ఆరోగ్యంపై ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన లేకపోవడంతో భవిష్యత్తులో వచ్చే ఆరోగ్య సమస్యలు వారికి ఆర్థిక భారాన్ని ఇవ్వకూడదనే మంచి ఆలోచనతో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారన్నారు. మన భవిష్యత్తు కోసం మంచి ఆలోచనలు చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలంతా బాసటగా నిలవాలని గోపి కోరారు. శిబిరంలో డాక్టర్ సిద్ధా భారతీరాణి, డాక్టర్ కొవ్వూరి ప్రభాకర్‌రెడ్డి, డాక్టర్ జాన్‌లియో, డాక్టర్ లెనిన్ డాక్టర్ సంతోష్‌కుమార్ రోగులను పరీక్షించి మందులు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ దెందులూరు నియోజకవర్గ పరిశీలకుడు యడ్ల తాతాజీ, ఎంపీపీ రావూరి వెంకటరమణ బుజ్జి, పార్టీ మండల కన్వీనర్ పొత్తూరి బుచ్చిరాజు, సర్పంచ్ కవురు గోపి, ఉప సర్పంచ్ ముత్తాబత్తుల లక్ష్మీరాధ, పార్టీ గ్రామ అధ్యక్షుడు పాకా సూర్యనారాయణ, ఎంపీటీసీ సభ్యురాలు కవురు నాగలక్ష్మి, నాయకులు పెన్మెత్స జలదుర్గ వరప్రసాదరాజు (బుజ్జిరాజు) బోనం బులివెంకన్న, ఉచ్చుల స్టాలిన్, ఇలపకుర్తి నరసింహారావు పాల్గొన్నారు.



పెనుగొండ: సిద్ధాంతంలో వృద్ధుడిని వైద్య శిబిరానికి తీసుకువస్తున్న బంధువులు

ప్రతి ఒక్కరూ ఆరోగ్యంతో జీవించాలి

పాలకొల్లు అర్బన్: ప్రతి ఒక్కరూ ఆరోగ్యంతో జీవించాలనే లక్ష్యంతో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి వైద్యనిపుణులతో పరీక్షలు చేయిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) చెప్పారు. పాలకొల్లు మండలం చింతపర్రులో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. శిబిరంలో రోగులకు అందుతున్న వైద్య సేవలను ఆయన తెలుసుకున్నారు. ఓపీ రిజిస్ట్రేషన్, కంటి పరీక్షలు, ఈసీజీ, రక్త పరీక్షలు, ఆరోగ్యశ్రీ కౌంటర్‌లను పరిశీలించారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పౌష్టికాహార శిబిరాన్ని గోపి పరిశీలించి అంగన్‌వాడీ టీచర్లు తయారు చేసిన ఆహార పదార్థాలను రుచి చూశారు. ఆయుష్మాన్ భారత్‌లో రూ.5లక్షల విలువైన ఆరోగ్యశ్రీ కార్డులను లబ్ధిదారులకు అందజేశారు. మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ సుధీర్, డాక్టర్ నవ్యజీవన్, డాక్టర్ సత్య సౌజన్య, డాక్టర్ గంగాభవాని 401 మంది రోగులను పరీక్షించారు. వీరిలో 11 మందిని ఆరోగ్యశ్రీలో శస్త్ర చికిత్సలకు సిఫార్సు చేశారు. 120 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. 60 మందికి కళ్లజోళ్లు అందజేతకు చర్యలు తీసుకున్నారు. 45 మందిని కంటి శస్త్ర చికిత్సల కోసం సిఫార్సు చేశారు. గ్రామ సర్పంచ్ గుమ్మాపు పెద్దిరాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీపీ చిట్టూరి కనకలక్ష్మి, జెడ్పీటీసీ నడపన గోవిందరాజుల నాయుడు, తిరుమల తిరుపతి దేవస్థానం పాలక మండలి సభ్యుడు మేకా శేషుబాబు, వైఎస్సార్ సీపీ దెందులూరు పరిశీలకుడు యడ్ల తాతాజీ, ఉప సర్పంచ్ పెన్మెత్స వెంకట రామకృష్ణంరాజు, మండల కన్వీనర్ ఎం.మైఖేల్ రాజు, మండల పరిషత్ మాజీ ప్రతిపక్ష నేత చిట్టూరి ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యకర వాతావరణమే లక్ష్యం

నరసాపురం రూరల్: రాష్ట్రం అంతటా ఆరోగ్యకరమైన వాతావరణం ఉండాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. నరసాపురం మండలం లక్ష్మణేశ్వరం 2 గ్రామ సచివాలయం వద్ద శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంపును ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రసాదరాజు మాట్లాడుతూ మనం, మన కుటుంబం అంతా ఆరోగ్యంగా ఉండాలంటే మంచి ఆహారపు అలవాట్లను కూడా పాటించాల్సి ఉందన్నారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న మెడికల్ క్యాంపుల వద్ద స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న పౌష్టికాహార స్టాల్స్ ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారన్నారు. ఇక్కడ నయం కాని రోగాలు ఉన్న వారిని గుర్తించి వారికి అవసరమైన వైద్యం అందించేందుకు పెద్దాసుపత్రులకు రిఫర్ చేస్తారని, అక్కడ అయ్యే వైద్య ఖర్చులను కూడా పూర్తిగా ప్రభుత్వమే భరిస్తుందని ప్రసాదరాజు వివరించారు. ఆపరేషన్లు జరిగే వారికి విశ్రాంతి సమయంలో ఖర్చుల నిమిత్తం రూ.5వేలు సహాయాన్ని అందిస్తున్నామన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగ పరచుకోవాలన్నారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ గుబ్బల రాధాకృష్ణ, జెడ్పీటీసీ బొక్కా రాధాకృష్ణ, వైస్ ఎంపీపీ ఉంగరాల రమేష్ నాయుడు, దొంగా మురళీకృష్ణ, జిల్లా మత్స్యకార సంఘం అధ్యక్షుడు అండ్రాజు చల్లారావు, సర్పంచ్ తిరుమాని వెంకట్రాజు, పార్టీ నాయకులు గోగుమండ సుగుణరావు, చాగంటి సత్యానారాయణ, మైలాబత్తుల శ్రీను, కడలి పద్మరాజు, మంతెన సువర్ణరాజు పాల్గొన్నారు.

పల్లెపల్లెకు వైద్యసేవలు

మొగల్తూరు: పల్లెపల్లెకు వైద్యసేవలను అందించేందుకే జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంపును ఏర్పాటు చేశామని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. మొగల్తూరు మండలం కొత్తపాలెం సచివాలయం వద్ద జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంపును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని సర్కారు గ్రామాల్లో విలేజ్ క్లినిక్ భవనాలను నిర్మించుకుని సింగిల్ బెడ్ ఆసుపత్రులను ఏర్పాటు చేయడం ద్వారా గ్రామస్థాయిలోనే అనారోగ్య సమస్యల పరిష్కారానికి శ్రీకారం చుట్టిందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ తిరుమాని బాబ్జి, వైస్ ఎంపీపీలు కైల సుబ్బారావు, కవురు సీతామహాలక్ష్మి, సర్పంచ్ లోకం నాగలక్ష్మి, ఎంపీటీసీ వెంకటేశ్వరరావు, పడవల మేరీ సత్యనారాయణ, మోటుపల్లి రామ భాస్కరరావు, మండల ప్రత్యేకాధికారి విజయలక్ష్మి, ఎంపీడీవో వంద్రు బాబ్జిరాజు తదితరులు పాల్గొన్నారు.



పెనుమంట్ర: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు



పెనుగొండ: ఆచంట మండలం కొడమంచిలిలో మందులు అందిస్తున్న రుడా చైర్‌పర్సన్ షర్మిలారెడ్డి



పాలకొల్లు అర్బన్: చింతపర్రులో ఓపీ రిజిస్ట్రేషన్‌ను పరిశీలిస్తున్న వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరి గోపాలరావు(గోపి)

సీఎం జగన్ పేదలకు చేసిన మంచిని వివరించాలి



తూర్పుపాలెంలో వైఎస్సార్ సీపీ నాయకులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే శ్రీరంగనాథరాజు

పెనుగొండ: నాలుగున్నర సంవత్సరాల పాలనలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద కుటుంబాలకు చేసిన మంచిని వివరించాలని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఆచంట ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు సూచించారు. శుక్రవారం తూర్పుపాలెంలో పార్టీ నాయకులతో ఆయన సమీక్ష నిర్వహించారు. పార్టీ ఆదేశాల మేరకు ఈనెల 11వ తేదీ నుంచి 'వై నీడ్ జగన్ అన్న' అంశాన్ని ప్రజలకు వివరించడానికి వినూత్న కార్యక్రమం ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. అధినాయకత్వ సూచనలు పాటిస్తూ ప్రజలకు చేసిన మంచిని వివరించి, ఆయా కుటుంబాలకు అందిన సంక్షేమాన్ని మరింతగా ముందుకు తీసుకెళ్లాలన్నారు. ప్రతిపక్షాలు చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పి కొట్టడానికి ఈ కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా ప్రతి కుటుంబానికి ఎంతో లబ్ధి చేకూరిందన్నారు. దీంతో పాటు ప్రతి గ్రామంలో అభివృద్ధి పనులు సైతం చేసినట్లు తెలిపారు. వీటిని ఆయా గ్రామాల్లో లబ్ధిదారులకు వివరించి మంచి చేసిన సీఎం జగన్‌కు అండగా నిలవాలని కోరాలన్నారు. దీంతో పాటు రాబోయే రోజుల్లో సీఎం జగన్ పేదలకు ఎందుకు అవసరమో తెలియజెప్పాలన్నారు. ఏ మాత్రం ప్రతిపక్షానికి మభ్యపడినా పేదలకు సంక్షేమం నిలిచిపోతుందని చెప్పారు. అంతేకాక వ్యవస్థలను చిన్నాభిన్నం చేసి ప్రజలను మ్యానేజ్ చేస్తూ మభ్యపెడ్తారని తెలిపారు. పేదలు నష్టపోకుండా సీఎం జగన్‌కు అండగా నిలవాలని తెలియజెప్పాలని సూచించారు. కార్యక్రమంలో రుడా చైర్‌పర్సన్, పార్టీ ఆచంట నియోజకవర్గ పరిశీలకురాలు మేడపాటి షర్మిలా రెడ్డి, ఏఎంసీ చైర్మన్లు వెలగల వెంకట రమణ(మిస్సీ), చిల్లే లావణ్య, ఎంపీపీలు కేవీఎస్ నారాయణ రెడ్డి(వాసు), సబ్బితి సుమంగళి, జెడ్పీటీసీలు గుంటూరి పెద్దిరాజు, కర్రి గౌరీ సుభాషిణి, మండల కన్వీనర్లు నల్లిమిల్లి వేణుప్రతాపరెడ్డి, దేవేంద్రుడు, మామిడిశెట్టి కృష్ణవేణి, జక్కంశెట్టి చంటి, పిల్లి నాగన్న, పార్టీ నాయకులు పోడూరి రామయ్య, కర్రి వేణుబాబు, కొవ్వూరి చిన్న తదితరులు పాల్గొన్నారు.

పేదలకు వరం సీఎం సహాయ నిధి



ఎల్‌ఓసీని రోగికి అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి)

పాలకొల్లు అర్బన్: ఆరోగ్యశ్రీలో వైద్యం పొందలేని పేద రోగులకు సీఎం సహాయ నిధి నుంచి ఆర్థిక సాయం మంజూరు కావడం వరమని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) అన్నారు. పోడూరు మండలం పెనుమదం గ్రామానికి చెందిన అడబాల దుర్గమ్మ గత కొంతకాలంగా కిడ్నీ, లివర్, గర్భస్థ సమస్యలతో బాధపడుతోంది. ఈమెకున్న వ్యాధులు ఆరోగ్యశ్రీలో వైద్యం చేయించుకోవడానికి అవకాశం లేదు. దీంతో దుర్గమ్మ భర్త వెంకట్రావు అప్పులు చేసి ఆమెకు వైద్యం చేయించారు. పరిస్థితిని గోపి దృష్టికి పార్టీ నాయకులు తీసుకురావడంతో స్పందించిన ఆయన రాజంపేట ఎంపీ, వైఎస్సార్ సీపీ ఉభయ గోదావరి జిల్లాల ఇన్‌చార్జ్ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి సహకారంతో సీఎం సహాయ నిధి నుంచి రూ.3 లక్షలు మంజూరు చేయించారు. దీనికి సంబంధించిన ఎల్‌ఓసీని శుక్రవారం పార్టీ కార్యాలయంలో నాయకుల సమక్షంలో దుర్గమ్మ భర్త వెంకట్రావుకు అందజేశారు. జెడ్పీటీసీ గుంటూరు పెద్దిరాజు, ఎంపీటీసీ చుట్టుగుళ్ల ఆంజనేయులు, పార్టీ మండల కన్వీనర్ కలిదిండి గణపతిరాజు, నాయకులు డీటీడీసీ బాబు, కొండేటి రవి, పితాని సత్యనారాయణ (చిన్నా), కొప్రపాటి వీరాస్వామి పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

ఆకివీడు: తల్లి గర్భంలో ఉన్న పసి కందు కూడా ఆరోగ్యంతో జన్మించాలని ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన కొనసాగిస్తున్నారని స్థానిక నగర పంచాయతీ 16వ వార్డు ఇన్‌చార్జి కొంచాడ బాబ్జీ చెప్పారు. వార్డులోని అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి వ్యక్తీ ఆరోగ్యానికి జగనన్న భరోసా కల్పిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు లాబాని రామారావు పాల్గొన్నారు.

జిల్లా జట్లకు ఎంపికైన ఎస్వీకేపీ విద్యార్థులు



ఎంపికైన విద్యార్థులతో కళాశాల అధ్యాపకులు

పెనుగొండ: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యాన ఏలూరులో జరిగిన అండర్-19 జిల్లా జట్ల ఎంపిక పోటీల్లో తమ కళాశాల విద్యార్థులు ఎంపికైనట్లు పెనుగొండ ఎస్వీకేపీ అండ్ పితాని వెంకన్న జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కొల్లి వెంకట రామ సూర్యనారాయణ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బాలుర అథ్లెటిక్స్‌లో బొంతు ప్రిన్సిబాబు జావెలెన్‌త్రో, డిస్కస్ త్రోలకు, వాలీబాల్ విభాగంలో కఠారి పవన్ కుమార్, మల్లిపూడి సూర్యప్రకాష్‌లు, పుట్‌బాల్‌లో కొమరపు అనిల్ కుమార్, మందపాటి రాధాకృష్ణ, తిగిరిపాటి రాకేష్‌లు, హాకీలో తలపాగల రోహిత్, కడలి మోహన వెంకటసాయి, బాస్కెట్ బాల్‌లో ఓలేటి సతీష్, ఎన్.ప్రవీణ్‌కుమార్, విజయకుమార్, ధోని, శ్రీవర్ధన్, రామ్‌శెట్టి, టేబుల్ టెన్నిస్‌లో పెన్నాడ నాని, రాయి రాముడు, పి.రవి, మల్లిపూడి సూర్యప్రకాష్, జి.హరీష్, క్రికెట్‌లో కె.కార్తీక్, ఆకుల సాయి, తలపాగల రోహిత్, పి.పెద్దిరాజు, బాలికల అథ్లెటిక్స్ హామర్‌త్రోలో ఎం.కుంతలేశ్వరి ఎంపికైనట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల పాలకవర్గం అధ్యక్షుడు పితాని సూర్యనారాయణ, సెక్రటరీ కరస్పాండెంట్ డాక్టర్ కలిదిండి రామచంద్రరాజు, కోశాధికారి ఉద్దగిరి లవకుమార్, పీడీ బి.దుర్గారావు, స్టాఫ్ కార్యదర్శి కడలి వెంకట రమణమూర్తి, డిగ్రీ కళాశాల పీడీ డాక్టర్ బి.బాపిరెడ్డి అభినందించారు.

సీసీ రోడ్ల నిర్మాణానికి చర్యలు

వైఎస్సార్ సీపీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల గోపి

పాలకొల్లు అర్బన్: రామయ్య హాలు శివారు ముచ్చర్ల వారి పుంత జీ+1 కాలనీలో మున్సిపల్ సాధారణ నిధులు రూ.25 లక్షలతో తక్షణమే సీసీ రోడ్లు నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నట్లు వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) హామీ ఇచ్చారు. జీ+1 కాలనీని శుక్రవారం గోపి సందర్శించారు. ఈ సందర్భంగా స్థానిక మహిళలు, యువత పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. కాలనీలో సుమారు 250 కుటుంబాలు నివసిస్తున్నాయని, రోడ్లు, డ్రైయిన్‌లు, వీధిలైట్లు తాగునీరు సమస్యలతో ఇబ్బందులు పడుతున్నామని మహిళలు సమస్యలను చెప్పడంతో ఆయన స్పందించారు. అన్ని పనులు ఒకేసారి పూర్తికావని, దశల వారీగా నిధులు మంజూరు చేసి కాలనీలో అన్ని రోడ్లు సీసీ రోడ్లుగా నిర్మించడానికి చర్యలు తీసుకుంటానన్నారు. మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి దయతో తమకు ఇళ్ల స్థలాలు దక్కాయని, అలాగే సీసీ రోడ్లు, తాగునీటి కుళాయిలు, డ్రైయిన్‌లు నిర్మించాలని మహిళలు కోరారు. కాలనీలో తాగునీటి కుళాయిల ఏర్పాటుకు రూ.27 లక్షలతో పైపులైన్ ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు గోపి చెప్పారు. అలాగే ప్రస్తుతం మున్సిపల్ వాటర్ ట్యాంకర్ ఒక్కటే వస్తుందని అక్కచెల్లెమ్మలు చెబుతున్నందున అదనంగా మరో వాటర్ ట్యాంకర్ ఏర్పాటు చేస్తానని గోపి హామీ ఇచ్చారు. కొత్తగా నిర్మించుకున్న ఇళ్లకు పన్నులు వేయాలని స్థానికులు కోరడంతో మున్సిపల్ అధికారులకు గోపి సూచనలు చేశారు. జీ+1కాలనీ తూర్పుభాగంలో కొంత స్థలం మిగిలి ఉన్నందున దానిని సర్వే చేసి ప్రజా అవసరాలకు వినియోగిద్దామని సూచించారు. వైఎస్సార్ సీపీ పట్టణ, మండల కన్వీనర్లు చందక సత్తిబాబు, ఎం.మైఖేల్ రాజు, వార్డు ఇన్‌చార్జ్ మద్దా చంద్రకళ, నక్కా చిత్తరంజన్, చదవలవాడ సాల్మన్ తదితరులు పాల్గొన్నారు.